www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 అక్టోబర్ 2023
5
పశ్చిమ గోదావరి

జిల్లాస్థాయి పోటీల్లో రామశింగవరం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - పెదవేగి

జిల్లాస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీల్లో పెదవేగి మండలం రామశింగవరం జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థినిలు సత్తా చాటారు. అండర్ 14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 12, 13 తేదీల్లో తణుకులో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన చలమాల దివ్యశ్రీ, అండర్-17 విభాగంలో దుక్కిపాటి సంజన అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పిడి జమ్మా రామకృష్ణలను శనివారం పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి.పద్మావతి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పరసా నాగార్జున, వెలివెల శ్రీను, మేకా లక్ష్మీనారాయణ, నీలిమ, మురళీ పాల్గొని విద్యార్థిలకు అభినందనలు తెలిపారు.

సాగునీటి కష్టాలు..!

ఉంగుటూరు మండలం నాచుగుంటలో బోర్ల నుంచి నీరందక ఎండిన పంటపొలం

చుట్టుముడుతున్న సాగునీటి సమస్య

దెబ్బతింటున్న వరి, మిర్చి వంటి పంటలు

పశువులకు మేతగా వరి పొలాలు

బోర్ల కింద, ఏజెన్సీలో కృష్ణా ఆయకట్టులోనూ ప్రమాద ఘంటికలు

వర్షపాతం లోటుతో కమ్ముకొస్తున్న కరువు

దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి కష్టాలతో జిల్లా రైతాంగం విలవిల్లాడుతోంది. ఈ ఏడాది లోటు వర్షపాతం కారణంగా ఏజెన్సీ, మెట్ట, కృష్ణా ఆయకట్టు ప్రాంతాల్లోని పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. దీంతో అన్నదాతకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లో వేలాది ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలను రైతులు సాగు చేసిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం నాలుగు నెలల్లో జులై మినహా జూన్, ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలల్లో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో వర్షాలు లేక జిల్లాను మెల్లమెల్లగా కరువు ఛాయలు కమ్ముకొంటున్నాయి. చాట్రాయి మండలంలో వర్షాధారంగా వేసిన వరిపైరు పశువుల మేతగా మారిపోయింది. సాగునీరు లేక పైరు ఎండిపోవడంతో రైతులు పొలాలను వదిలేస్తున్నారు. చింతలపూడి మండలంలోనూ వర్షాధార పంటంతా దెబ్బతింటోంది. దీంతో వేలాది ఎకరాల్లో వరిపైరు దెబ్బతింది. ఏజెన్సీ మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులో వేలాది ఎకరాల్లో మిర్చి, పత్తి, మినుము, వరి వంటి పంటలను రైతులు సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో సాగునీటి ఇబ్బందులతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుండేటివాగు, పెదవాగు ప్రాంతాల్లోని సాగును కాపాడుకునేందుకు వాగుల్లో పెద్దఎత్తున నీటిబోరులు వేసి పైపుల ద్వారా పంటను కాపాడుకునేందుకు నిద్రాహారాలు మాని రైతులు పరుగులు తీస్తున్నారు. ఉంగుటూరు, చింతలపూడి, జీలుగుమిల్లి తదితర మండలాల్లో కరెంటు కోతలు విధిస్తుండటంతో సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయానికి తొమ్మిది గంటల కరెంటు సరఫరా సక్రమంగా అమలుకాకపోవడంతో పొట్టదశలో ఉన్న వరిపొలాలు ప్రమాదంలో పడ్డాయి. ఇదిలా ఉండగా కాల్వ ఆధారిత ప్రాంతమైన పశ్చిమగోదావరి జిల్లాలోనూ సాగునీటి సమస్య తలెత్తుతోంది. ఆచంట మండలం శేషమ్మ చెరువు, పెనుగొండ, అత్తిలి, పాలకొల్లు రూరల్ మండలాల్లో కాల్వ శివారు ప్రాంతాల్లో సాగునీటి సమస్య ఉందని రైతులు వాపోతున్నారు. వంతులవారీ విధానం అవలంబిస్తున్నా ఆక్వా చెరువులకు నీటి మళ్లింపు తదితర కారణాల రీత్యా పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

ఎండుతున్న కృష్ణా ఆయకట్టు

ఏలూరు జిల్లాలోని కృష్ణా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. కాలువల ద్వారా నీరందకపోవడంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని దుస్థితి ఏర్పడింది. కృష్ణా ఆయకట్టులో దాదాపు 50 వేల ఎకరాలకుపైగా సాగవుతోంది. ఈ ఆయకట్టు పరిధిలో ఖరీఫ్‌లో మాత్రమే వరి పండుతోంది. రబీలో ఆరుతడి పంటలతోనే రైతులు ముందుకు సాగాల్సి ఉంటుంది. సాగునీరు అందకపోవడంతో ఉన్న ఒక్క పంట ప్రమాదంలో పడిందంటూ రైతులు లబోదిబోమంటున్నారు. సాగునీటి సమస్యపై అధికారులు పెద్దగా స్పందించకపోవడంపై రైతుల్లో తీవ్ర విమర్శలు విన్పిస్తున్నాయి. పట్టిసీమద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయకపోతే కృష్ణా ఆయకట్టు పరిధిలోని పంటలు దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అండగా నిలవాలని అంతా కోరుతున్నారు.

నీరు లేక పొలాలు ఎండుతున్నాయి

బైరెడ్డి లక్ష్మణరావు, సుంకరవారితోట

కృష్ణా ఆయకట్టు పరిధిలో జాలిపూడి గ్రామంలో పదెకరాలు సాగు చేశాను. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశలో ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలకుపైగా పెట్టుబడి పెట్టాం. సాగునీరు లేక పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సాగునీరు అందించి పంటను కాపాడాలి.

విద్యుత్ భారాలను తక్షణం ఉపసంహరించాలి

వామపక్షాల ఆధ్వర్యాన కొనసాగిన ఆందోళనలు

తణుకులో నిరసన తెలుపుతున్న సిపిఐ, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రజలకు మోయలేని భారంగా పరిణమించిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా శనివారం స్థానిక నరేంద్ర సెంటర్లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ప్రజలపై ఎలాంటి భారాలు మోపబోమని, విద్యుత్ ఛార్జీలు అసలు పెంచబోమని వాగ్దానాలు గుప్పించి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో రూ.50 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు యోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిపిఎం నేతలు కామన మునిస్వామి, గార రంగారావు, ఎం.గోవిందరాజు, సిపిఐ నేతలు గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్ట అమ్మిరాజు, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు, పీక్ టైమ్ ఛార్జీలు, పెనాల్టీల రూపంలో రాష్ట్రంలో ప్రజలను విద్యుత్ భారాలతో వేల కోట్లు దోచుకున్నారని సిపిఐ భీమవరం రూరల్ కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యాన శనివారం భీమవరం మండలం నాగిడిపాలెం, నాగేంద్రపురం, కొత్తపూసలమర్రు గ్రామాల్లో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో వామపక్షాల నాయకులు నాగిడి శాంతమూర్తి, తిరుమాని చంటిరాజు, నాగిడి తులసీరాజు, నాగిడి నాగరాజు, కనుమూరి వెంకటపతిరాజు, తిరుమాని విమలాదేవి, తిరుమాని వనమయ్య, గాది ధర్మరాజు, కొల్లాటి గోవిందు పాల్గొన్నారు.

16 నుండి ఇవిఎంల పరిశీలన

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలి : కలెక్టర్ ప్రశాంతి

వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 16వ తేదీ నుండి 40 రోజులపాటు ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల మొదటి దశ పరిశీలన నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ పరిశీలనకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఇవిఎంల పరిశీలన విధానంపై వివరించారు. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు మొదటి దశ పరిశీలన జరుగుతుందన్నారు. 24 టేబుల్స్ ఏర్పాటు చేస్తామని, ఆయా టేబుల్లో డిటి, పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్‌లను ఉంచుతామని తెలిపారు. 12 మంది బెల్ కంపెనీ ఇంజినీర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షుల నుంచి ఫొటోలతో ఆథరైజేషన్ పత్రం తీసుకురావాలని, వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఇవిఎం గొడౌన్‌లోకి సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. ఇవిఎంలతో మాక్ పోలింగ్ నిర్వహిస్తామని, సంబంధిత పార్టీల ప్రతినిధులు స్వయంగా ఇవిఎం బటన్‌లను నొక్కి ఓటు చెకింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. పనితీరు సక్రమంగా ఉన్న వాటికి ప్రతి నిధులు అందరూ సంతకం చేసి ఇచ్చిన పేపర్‌ను ఉంచి సీల్ చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు, టి.వంశీశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇవిఎంల గొడౌన్ పరిశీలన

ఇవిఎం, వివి.ప్యాడ్‌లను భద్రపరిచిన గొడౌన్లను కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ నెల 16న నిర్వహించబోయే ఇవిఎంల మొదటి దశ పరిశీలనా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందజేశారు. పరిశీలన పకడ్బందీగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామల, మున్సిపల్ ఇంజినీర్ త్రినాధ్‌రావు, ఎన్నికల సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

యువతలో సమైక్యతను పెంపొందించాలి: కలెక్టర్

యువతలో దేశ సమైక్యతను, సమగ్రతను పెంపొందించేందుకే నా మట్టి - నా భూమి కార్యక్రమంలో మట్టి సేకరణ చేపట్టామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నా మట్టి-నా భూమి కార్యక్రమంలో భాగంగా మండలాలవారీ సేకరించిన మట్టితో నింపిన కలశాలు విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి చేరాయి. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలశాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జన్మభూమిపై మమకారంతోపాటు నాటి స్వాతంత్ర సమరయోధుల నుండి స్ఫూర్తి పొందాలన్నారు. త్యాగాల ఫలితంగా సిద్ధించిన స్వాతంత్రాన్ని నేడు స్వేచ్ఛగా అనుభవిస్తున్నామన్నారు. నేటి తరానికి నాటి పోరాట పటిమను తెలియజెప్పేందుకే ఆజాదికా అమృత్ మహోత్సవం పేరిట పెద్దఎత్తున కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న మట్టికలశాన్ని ఈ నెల 22 నుంచి 27వ తేదీల మధ్య రాష్ట్ర ప్రధాన కేంద్రానికి చేర్చే కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డిఇఒ ఆర్.వెంకటరమణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, కలెక్టరేట్ ఎఒ వైకెపి.అప్పారావు, విద్యాశాఖ కమ్యూనిటీ మొబైలైజేషన్ అధికారి ఎ.రామకోటేశ్వరరావు, డివైఇఒ డి.శ్రీరామ్, పలువురు ఎంఇఒలు, విద్యాశాఖ పర్యవేక్షకులు టి తిరపతిరాజు, పి కుమారస్వామి పాల్గొన్నారు.

ఎస్ఐ అభ్యర్థుల తొలిరోజు పరీక్షలు ప్రశాంతం

పరీక్షా కేంద్రంలో డిఐజి అశోక్‌కుమార్ పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్ష మొదటి రోజు శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 4162 మంది అభ్యర్థులకుగాను ఉదయం పరీక్షకు 52 మంది, మధ్యాహ్నం పరీక్షకు 53 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం సమయానికి ప్రతి అభ్యర్థినీ పోలీస్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి మరీ తనిఖీలు నిర్వహించారు. హాల్ టిక్కెట్‌తోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్ష 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, రెండో పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించారు. ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయనతోపాటు ఏలూరు జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువా, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి శ్రీధర్, ఏలూరు అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.

వివరాలు పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి

పరీక్షా కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బీచ్‌లో సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద మృతి

మృతదేహాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి (ఇన్‌సెట్లో సుహాస్)

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో సచివాలయ ఉద్యోగి అనుమానాస్పదంగా మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. భీమవరం పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన జక్కం కుమార వెంకటసాయి సుహాస్ ఎల్‌విఎన్.పురంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం బీచ్‌లో కుమార వెంకటసాయి సుహాస్ మృతదేహాన్ని గమనించిన స్థానికులు అతని జేబులోని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న బంధువులు మృతదేహం వెంకట సాయి సుహాస్‌దిగా గుర్తించారు. మృతుని తండ్రి జక్కం సత్యసూర్య ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కె.సత్యనారాయణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలిని నరసాపురం డిఎస్‌పి కె.రవిమనోహరాచారి, సిఐ శ్రీనివాస్‌యాదవ్ సందర్శించి వివరాలు సేకరించారు.

సాగు నీరందక రైతుల పరిస్థితి దయనీయం

మాజీ మంత్రి పితాని

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో రోజురోజుకీ సాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతుందని, సాగు నీరందని ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని శేషమ్మ చెరువులో నీరు లేక నెర్రలు తీసిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ రబీ సీజన్లో నీటిఎద్దడి కనిపిస్తే సర్వసాధారణమనుకోవచ్చని, ఖరీఫ్‌లోనూ నీటిఎద్దడి ఉందంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. సమీపంలో ఉన్న గోదావరిలో పుష్కలంగా నీరున్నప్పటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. పొలాలు చిరు పొట్ట దశలో ఉండగా శివారు భూములకు సాగునీరందకపోవడంతో చేలు బీటలు వారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నీటి సంఘాలను ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మంత్రులు, అధికారులు పంట పొలాలను పరిశీలించి ఎండిపోతున్న పొలాలకు సమృద్ధిగా నీటిని అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, టిడిపి మండలాధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు ప్రసాద్, తమ్మినీడి పద్వీకుమార్, కేతా మురళి, నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ప్రభాకర్, బాలాజీ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం ప్రజల హక్కు

డిప్యూటీ సిఎం కొట్టు

ప్రజాశక్తి - పెంటపాడు

సంపూర్ణ ఆరోగ్యం ప్రజల హక్కు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. నా ఆరోగ్యం కాపాడాలని ప్రభుత్వాన్ని అడిగే హక్కు ప్రజలకు ఉందన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఆరోగ్యం కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడానికి సిఎం జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. రెండు నెలలపాటు జరిగే కార్యక్రమంలో ముందుగా ప్రతి ఇంటికీ వాలంటీర్ వచ్చి సర్వే చేసిన అనంతరం వాలంటీరు, ఆశా కార్యకర్త, ఎఎన్ఎం వచ్చి ఏడు రకాల పరీక్షలు ఉచితంగా చేసి టోకెన్ ఇస్తారన్నారు. అనంతరం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చి మరిన్ని పరీక్షలు ఉచితంగా చేయించుకుని మందులు ఉచితంగా పొందాలన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి రిఫరల్ ఆసుపత్రులకు పంపించి ప్రభుత్వమే ఉచితంగా వైద్యం చేయించడంతోపాటు మందులు కూడా ఇస్తుందన్నారు. ప్రతినెలా అవసరమైన మందులు ఉచితంగా ఇస్తూ ఫ్యామిలీ డాక్టర్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాజమండ్రి జిఎస్ఎల్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి ఖర్చుకు వెనుకాడకుండా పూర్తి ఆధునిక వైద్య పరీక్షల పరికరాలతో కూడిన కోట్లాది రూపాయలు విలువజేసే రెండు మొబైల్ మెడికల్ టెస్టింగ్ యూనిట్లు (రెండు బస్సులు), 20 మంది స్పెషలిస్టులను రప్పించి హాస్పిటల్ ఆన్ వీల్స్‌గా మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని మంత్రి కొట్టు వివరించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైకాల శ్రీనివాసరావు, పెంటపాడు జెడ్‌పిటిసి, ఎంపిపి ఉప్పులూరి వరలక్ష్మి, దాసరి హైమావతి, మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్ కుమార్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్ధన్‌రావు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు నల్లిమిల్లి గాంధీరెడ్డి, పెంటపాడు సర్పంచి తాడేపల్లి సూర్యకళ, ఎంపిటిసిలు రెడ్డి సూరిబాబు, నాగమణి, ఉప సర్పంచి కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, గుండుమోగుల సాంబయ్య, నల్లిమిల్లి అంజిరెడ్డి, కర్రి వరహాలరెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి, ఎంపిడిఒ బాలాజీ పాల్గొన్నారు.

ఆకలి తీరేదెలా.. ఆత్మహత్యలు ఆపేదెలా..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సగటు వేతన జీవుల కుటుంబాలు సకాలంలో జీతాలందక పస్తులుంటున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ విధానాల ఫలితంగా పెరిగిన ఒత్తిడితో కొందరు తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడటం అందరినీ కలచివేస్తోంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికార పక్షం జగనన్న ఆరోగ్య సురక్ష అంటూ హడావుడిలో నిమగ్నమవ్వగా ప్రధాన ప్రతిపక్షం టిడిపి చంద్రబాబు కోసం నిరసన దీక్షల్లో తలమునకలైంది. వామపక్షాలు ప్రధానంగా సిపిఎం ఎప్పటిలానే వేతన జీవులతోపాటు సామాన్యుల నుంచి చిన్న పెట్టుబడిదారుల వరకూ అందరికీ భారంగా మారిన విద్యుత్ ఛార్జీల రద్దు చేయాలంటూ ప్రత్యక్ష కార్యాచరణలో ముందుకు సాగుతున్నాయి.

ప్రస్తుత కాలంలో మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, మాతృభాషా విద్యావాలంటీర్లు, విఒఎలు బకాయి వేతనాల కోసం నిరాహారదీక్షలు, నిరవధిక ధర్నాలు చేపట్టి రోడ్డెక్కారు. వీరిలో మున్సిపల్ స్కూల్ స్వీపర్ల వేతనం కేవలం రూ.4 వేలే. దానికీ ఈ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతుందని తెలిసి అంతా నివ్వెరపోయారు. ఎట్టకేలకు జిల్లా అధికారులు స్పందించి వేతన బకాయిలిస్తామని హామీ ఇవ్వడంతో స్వీపర్లు దీక్షలు విరమించారు. విఒఎలు తమ సమస్యలు పరిష్కరించాలని, బకాయి వేతనాల కోసం, ఉద్యోగ భద్రత కోసం 36 గంటలు నిరవధిక ధర్నా నిర్వహించారు. బకాయి వేతనాలు, తమ పరిధిలోని ఇతర అంశాలను పరిష్కరిస్తామని జిల్లా అధికారులు హామీ ఇచ్చారు. మాతృభాషా విద్యావాలంటీర్లకు అయితే గత సంవత్సరానికి సంబంధించి రెండు నెలల బకాయి వేతనాలివ్వాల్సి ఉంటే ఒక నెల వేతనం ఇస్తామని సంబంధిత అధికారులు చెప్పడం వారిని కలిచివేసింది. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న మాతృభాషా వాలంటీర్లు ఒక నెల జీతంతోపాటు మిగిలిన బకాయిలు, సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వీరితోపాటు పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గత నెల జీతం ఇప్పటికీ అందలేదు. అదేసమయంలో వివిధ శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సుమారు రెండు నెలలకుపైగా వేతన బకాయిలున్నాయి. ఆ కుటుంబాలన్నీ అర్థాకలితో అలమటిస్తున్నాయి. ఇదిలా ఉండగా నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులు తమకు మెస్ భోజనం నాణ్యతగా ఉండటం లేదని, దీనివల్ల తాము పస్తులుంటున్నామని ఆందోళన చేపట్టారు. తమ ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటి అనేది ప్రతిష్టాత్మక సంస్థ. అలాంటి సంస్థలో విద్యార్థులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి చదువుకుంటుంటారు. అంతటి ప్రతిష్టాత్మకమైన సంస్థలోని మెస్‌లో భోజనం సరిగాలేదని విద్యార్థులు ఆందోళన చేపట్టాల్సి రావడం నిజంగా పర్యవేక్షణాలోపమే. నూజివీడు సబ్ కలెక్టర్, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ హామీతో విద్యార్థులు ఆందోళన విరమించారు. గతంలోనూ తాడేపల్లిగూడెంలోని నిట్ విద్యార్థులు భోజనం విషయంలో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గకుండా అధికారుల పర్యవేక్షణ పెరగాల్సి ఉందని స్పష్టమవుతోంది. లేనిపక్షంలో జిల్లాలో అటు చిరుద్యోగులు, వేతనజీవులు, ఇటు విద్యార్థుల ఆకలితో అలమటించే ప్రమాద ఘంటికలు పొంచి ఉన్నాయి.

ఇదిలా ఉండగా ప్రభుత్వ విధానాల ఫలితంగా పెరిగిన ఒత్తిడితో గ్రామస్థాయి చిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతుండటం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. గణపవరం మండలం జల్లికాకినాడ వాసి ఉండి మండలం కోలమూరులో సర్వేయర్‌గా పని చేస్తూ పని ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడటం అందరినీ కలచివేసింది. రీసర్వే పేరుతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా చిరుద్యోగులపై అధికారుల ఒత్తిడి పెరగడం, కొన్నిచోట్ల దుందుడుకుగా, అవమానకరంగా మాట్లాడుతుండటంతో గ్రామస్థాయి ఉద్యోగులు మానసికంగా కుంగిపోతున్నారు. ఇదే విధంగా ఏలూరు జిల్లాలో లింగపాలెం మండలంలో తనపట్ల పిహెచ్‌సి వైద్యురాలి వ్యవహారశైలిని తట్టుకోలేక ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అందరికీ తెలిసిందే. మొత్తంగా పరిశీలిస్తే ప్రభుత్వ విధానాల ఫలితంగా జీతాలందక, ఇటు అధికారుల ఒత్తిడి పెరిగి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరుద్యోగులు ఆకలితో అలమటిస్తూ.. అవమానాలు తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడే పరిస్థితులు దాపురించాయనేది స్పష్టమవుతోంది.

ఇక సిపిఎస్‌తోపాటు జిపిఎస్‌నూ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని జిల్లాలో యుటిఎఫ్ ఆధ్వర్యాన పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభమైంది. వ్యవసాయ విద్యుత్ కోతలు ఆపాలని రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. విద్యుత్ భారాలను ఉపసంహరించాలని సిపిఎం, వామపక్షాల ఆధ్వర్యాన ప్రచారం, ప్రజాబ్యాలెట్ నిర్వహణ, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో రెండు జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా తయారైన రోడ్లకు మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలంటూ సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్రలు, మోటార్ సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో వివిధ తరగతుల ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా వామపక్షాలు మినహా అటు అధికారపక్షం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఆర్భాటం చేస్తుండగా, ప్రతిపక్ష టిడిపి చంద్రబాబును జైలు నుంచి విడుదల చేయాలంటూ దీక్షలకే పరిమితమవుతుండటం జిల్లావాసుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో దీని ప్రభావం ఆయా పక్షాలపై కచ్చితంగా పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

నేడు ఉచిత బ్లడ్ షుగర్ క్యాంపు

ప్రజాశక్తి - పాలకొల్లు

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఈనెల 15వ తేదీన ఉచిత బ్లడ్ షుగర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ కాపు క్లబ్ అధ్యక్షులు గాదె అంజనేయులు, కార్యదర్శి పి.రవికుమార్ తెలిపారు. పాలకొల్లు యడ్ల బజార్ సెంటర్ వద్ద ఉన్న అబ్దుల్ కలాం పార్కు వద్ద ఈ శిబిరాన్ని హర్ష మెడ్ ల్యాబ్ సౌజన్యంతో తమ క్లబ్ నిర్వహిస్తుందన్నారు.

హెచ్ఐవి బాధిత బాలలకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 'మానవత' శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహార సరుకులను శనివారం అందించారు. పాలకొల్లు కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో సరుకులను అందించారు. మానవత సభ్యులు శిడ్డాని మల్లేశ్వరరావు ఆర్థికసాయం చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు చంద్రశేఖర్, పాలకొల్లు కన్వీనర్ ముత్యాల రామారావు, అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ధనాని సూర్యప్రకాష్, సభ్యులు బొక్కా రమాకాంత్, అందె చిరంజీవి, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, పాజిటివ్ పీపుల్ సొసైటీ సభ్యులు శేషారత్నం పాల్గొన్నారు.

దసరా ఉత్సవ మండపాలకు అనుమతులుండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

దసరా ఉత్సవ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ షేక్ మదీనా బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, డిజె సౌండ్ అనుమతి లేదన్నారు. అనుమతుల కోసం స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్షతగాత్రునికి మానవత సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

గవరపేటకు చెందిన దాడి అప్పారావు ఇటీవల అనారోగ్యం బారిన పడి కాలికి శస్త్రచికిత్స చేయించుకోవడంతో వాకర్స్ క్లబ్ సభ్యులు స్పందించి రూ.25 వేలు సేకరించి పాలకొల్లు క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకర్ ద్వారా శనివారం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమా శంకర్‌రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, నరాది రామచంద్రరావు, ధనాని శ్రీరామ్మూర్తి, నంబూరి గంగాపవన్, జవ్వాజి కళ్యాణ్, మేకా త్రిశూలపాణి, దాసరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గమ్మకు వెండి చీర బహూకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్థానిక కనకదుర్గమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన కర్రి సుబ్బారెడ్డి, శాంతి దంపతులు సహాయంతో రూ.ఆరు లక్షల విలువైన వెండితో రూపొందించిన చీరను అమ్మవారికి శనివారం అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతుల స్వగ్రామం పెనుమంట్ర అయినప్పటికీ హైదరాబాద్‌లో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి యాత్రికులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ తమనంపూడి సాయి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు, అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



భీమవరంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గ్రంధి రవితేజ

గ్రంధి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నాయకుల పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం హర్షణీయమని డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం ప్రభుత్వవిప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వాస్పత్రికి విలువైన సామగ్రిని వారి అభిమానులు అందించడం గొప్ప విషయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గ్రంధి పుట్టినరోజు సందర్భంగా ఏరియా ఆసుపత్రికి కుటుంబ నియంత్రణ విభాగానికి సుమారు రూ.25 వేలు విలువ కలిగిన సామగ్రిని ఆయన వీరాభిమాని ఆలపాటి తులసి వెంకటరమణ సహకారంతో గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ ద్వారా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి తులసి వెంకటరమణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరస్వామి, రామమహేశ్వరి, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పేరిచర్ల సత్యనారాయణ, కొప్పర్తి వీర రాఘవులు పాల్గొన్నారు.

రైతులు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని వైసిపి యువ నాయకులు గ్రంధి రవితేజ అన్నారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని స్థానిక ఎఎంసిలో శనివారం సాయంత్రం రైతులను సన్మానించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవితేజ మాట్లాడుతూ గ్రంధి పుట్టినరోజు సందర్భంగా రైతులను సన్మానించడం అభినందనీయమన్నారు. ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గ అభివృద్ధిలో గ్రంధి రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, వన్ టౌన్ జెసిఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, నాయకులు కోడే యుగంధర్, నామన మహేష్ పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న సిఎం జగన్, అదే మాదిరిగా తన తండ్రి బాటలో నడుస్తున్న పార్టీ శ్రేణులకు వైసిపి యువ నేత, గ్రంధి శ్రీనివాస్ కుమారుడు రవితేజ అన్నారు. శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, విజయలక్ష్మి దంపతులు కోడె వీరమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కామక్షమ్మ ఆలయం వద్ద 400 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవితేజ మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తున్న తన తండ్రి పట్ల నియోజకవర్గ ప్రజలు ఎంతో అభిమానం, ఆప్యాయతతో ఉన్నారన్నారు. యుగంధర్, విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ రాజకీయంగా తాము అన్ని విధాలుగా ప్రజలకు సేవ చేసే అదృష్టం నాడు గ్రంధి వెంకటేశ్వరరావు, నేడు ఆయన తనయులు గ్రంధి శ్రీనివాస్ తమకు ఇచ్చారని, జీవితాంతం వారికి రుణపడి ఉంటామన్నారు. అలాగే మార్కెట్ యార్డ్‌లో, మండలంలోని తుందుర్రు బలవంతిప్ప గ్రామాల్లో వైసిపి నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, ఆలయ ఛైర్మన్ మందారపు శ్యామ్ సుందర్, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, తమ్మిరి శరత్, శ్రీశైలపు నాగబాబు, ఇంటి సత్యనారాయణ, బొత్స ధర్మ, షేక్ అన్సారి, చక్రి పాల్గొన్నారు.

వీరవాసరం: భీమవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మరోసారి గెలిపించుకోవాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. గ్రంధి పుట్టినరోజు వేడుకలను వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు ఆధ్వర్యంలో వీరవాసరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మరో ముఖ్యఅతిథి గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు సంయుక్తంగా కేకును కట్ చేశారు. పేదలకు చీరలు పంచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, నాగరాజు శ్రీనివాస్‌రాజు, సర్పంచులు చికిలే మంగతాయారు, సహకార సంఘాల ఛైర్మన్‌లు మానుకొండ ప్రదీప్‌కుమార్, కటికిరెడ్డి రాంబాబు, కురెళ్ల కాశీ, ఎంపిటిసిలు వీరవల్లి ఉషారాణి, బోను జోత్స్నదేవి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచంటలో దీక్ష చేపట్టిన నేతలు

చీకటి రాజకీయాలు చేస్తున్న జగన్ : పితాని

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఆచంట

ఓటమి భయంతోనే సిఎం జగన్ చీకటి రాజకీయాలు చేస్తున్నారని మాజీమంత్రి, టిడిపి నేత పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆచంటలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్నవారికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబును ఇబ్బందులకు గురి చేయడమే జగన్ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులుఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నెక్కంటి ప్రభాకర్, నరసింహమూర్తి, చిలుకూరి శ్రీను, నాగార్జున, సత్యనారాయణ, బాలాజీ, సీతారాం పాల్గొన్నారు.

పాలకొల్లు : జైలులో చంద్రబాబుకు ప్రాణహాని ఉందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. పాలకొల్లులో టిడిపి నేతల 32వ రోజు నిరాహార దీక్షా శిబిరం వద్ద ఎంఎల్ఎ రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడారు. 2039 మంది ఖైదీలలో చంద్రబాబు ఒకరని సజ్జల వ్యాఖ్యానించడం అంటే ఐదు కోట్ల ఆంధ్రుల ఆస్తి చంద్రబాబు పట్ల జగన్ ప్రభుత్వం ఎంత చులకనగా ఉందో అర్థమవుతుందన్నారు. వైద్యులు చంద్రబాబు ఆరోగ్య బులిటెన్ విడుదల చేయకముందే సజ్జల చంద్రబాబు బరువు గురించి ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. చొక్కా చేతి చివరి వరకు ఉంచుకుంటే వేడి రాకపోతే ఏమొస్తుంది అంటూ సజ్జల చంద్రబాబు ఆరోగ్యాన్ని ఎగతాళి చేయడం బాధాకరమన్నారు. గతంలో జయలలిత, మైకేల్ జాక్సన్ వంటి వారికి స్టెరాయిడ్స్, స్లో పాయిజన్ వంటి వివాదాస్పద వైద్యం అంటూ అనుమానాస్పద మృతిగా నమోదు కావడం మనం చూశామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దీక్షలో క్షత్రియ కమ్యూనిటీ నేతలు దీక్షల్లో కూర్చున్నారు.

మొగల్తూరు : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలంలోని ముత్యాలపల్లిలో టిడిపి నాయకులు న్యాయదేవత చిత్రపటాలతో శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, దొంగ శ్రీను, కొల్లాటి పెంటయ్య, మూలాస్వామి, నాగేశ్వరరావు, సాయిబాబు, కోటేశ్వరరావు, బంధన నాగేశ్వరరావు, విజయకుమార్ ఉన్నారు.

మొగల్తూరు : ప్రజా సమస్యల పరిష్కారం కంటే రాజకీయ కక్ష సాధింపు చర్యలకే వైసిపి ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపుతుందని నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు విమర్శించారు. శనివారం మొగల్తూరులో టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు అధ్యక్షతన రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఎక్కువగా డ్రెయినేజీ, రోడ్ల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. చంద్రబాబుపై పెట్టిన కేసుల్లో ఆధారల్లేవన్నారు. ఆయనను విడుదల చేయాలని, జైల్లో చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొవ్వలి యత్తి రాజా రామ్మోహన్ నాయుడు, గుత్తుల సాయి. కలిదిండి కుమార్‌బాబు. కత్తిమండ ముత్యాలరావు, గుండు శ్రీను, రాజా పాము, శ్రీధర్, లక్కు పెద్దిరాజు, పంపన భగవాన్, పాల రాంబాబు, గోపాలం, చంటి, శ్రీను, కొల్లాటి భోగరాజు, కవురు నాగేశ్వరరావు, నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ ఉన్నారు.

పవన్‌పై విమర్శలు తగవు

పాలకొల్లు: పవన్‌కు హైదరాబాద్‌లో ఒక ఇల్లు ఉంటే జగన్‌కు హైదరాబాద్, అమరావతి, బెంగళూరులో మూడు ప్యాలెస్‌లున్నాయని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరరామ జోగయ్య తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ పవన్‌కు నెలకు రూ.60 కోట్ల ఆదాయం వస్తుంటే జగన్‌కు శాండ్, ల్యాండ్, మైన్స్, వైన్స్ ద్వారా రూ.ఆరు వేల కోట్ల ఆదాయం వస్తోందన్నారు. పవన్ కల్యాణ్‌కు ముగ్గురు భార్యలంటూ పదేపదే వ్యక్తిగత విమర్శలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు.

తపాలా పథకాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

తపాల శాఖ సంక్షేమ పథకాలపై పోస్టల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు భారీ జాతీయ జెండాతో అవగాహన ర్యాలీ, కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే దేశభక్తి ప్రతిజ్ఞ కార్యక్రమాలను ప్రధాన తపాల శాఖ కార్యాలయం వద్ద శనివారం ప్రారంభించారు. తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ టి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మన భారతదేశ గౌరవాన్ని ఔన్నత్యాన్ని జాతీయ జెండా పెంపొందించిందని, జాతీయ సమైక్యతకు, దేశభక్తికి ప్రతీక మన మువ్వన్నెల జెండా అని, భారత పోస్టల్ శాఖ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలని, పథకాలపై అవగాహన పెంచుతుందని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోస్టల్ సంక్షేమ పథకాలు ఎంతో లాభదాయకంగా ఉంటాయని, మనం జమా చేసిన నిధి భద్రంగా ఉంటుందని అన్నారు. అనంతరం జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడర్స్ ఫోరమ్స్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం, ప్రజా నాట్యమండలి సభ్యులు ఎస్‌కె చాన్ పాషా, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ అల్లు సురేష్, హెడ్ పోస్ట్ మాస్టర్ ఎస్ఎన్ ఆచార్యులు, యూనియన్ నాయకులు పి.లెనిన్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాపడావ్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బిజెపిని విమర్శించిన వారంతా దేశద్రోహులుగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రధాని మోడీ చిత్రీకరిస్తున్నారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు. సిఐటియు రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిఐటియు నాయకులు బి.సోమయ్య అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులకు ఉమామహేశ్వరరావు ముఖ్యవ్యక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 26, 27, 28 తేదీల్లో విజయవాడలో మహాపడావ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని తరగతుల ప్రజలను బిజెపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి కూటమి తామే గొప్ప దేశభక్తులమని ప్రచారం చేస్తూ, వారిని విమర్శించిన వారంతా దేశద్రోహులని ఎదురు దాడి చేస్తున్నారన్నారు. మతప్రమేయం లేని రాజకీయాలు దేశానికి అవసరమని ఆయన అన్నారు. కార్మికుల మతవిశ్వాసాలను బట్టి వారిని చీల్చి కార్మికోద్యమాన్ని బలహీనపరచడానికి రాజకీయాలు చేస్తున్నారని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 38 కోట్ల మంది అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులున్నారని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సదుపాయాలూ కల్పించడం లేదన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, బీమా వంటివి అమలు చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, ఊడిగం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు, కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజలు నడ్డి విరిచాయని విమర్శించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఏలూరు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.వాసుదేవరావు, నాయకులు పివి.ప్రతాప్, కె.పోసమ్మ, ఎస్.కుమారి, జి.విజయలక్ష్మి, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు బెస్ట్ కళాశాల అవార్డు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నత భారత్ అభియాన్‌లో భాగంగా దత్తత గ్రామాల్లో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అందిస్తున్న సాంకేతిక ప్రగతికి ఆంధ్రాయూనివర్సిటీ పరిధిలో 11 జిల్లాల్లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు బెస్ట్ అవార్డు ప్రదానం చేశారు. అదేవిధంగా యుబిఎ నిర్వహణలో చక్కని కృషి ఫలితంగా వెబ్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.రాంబాబుకు బెస్ట్ కో ఆర్డినేటర్ అవార్డు కూడా అందించారని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో తమ కళాశాలకు రెండు అవార్డులు దక్కటం పట్ల నిశాంత్ వర్మ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, బెస్ట్ కోఆర్డినేటర్ అవార్డు పొందిన డాక్టర్ టి.రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలల సమీపంలో ఉన్న ఐదు గ్రామాలను దత్తత తీసుకుని ఆయా గ్రామాల్లో సాంకేతిక ప్రగతి అందించాలనే ఉద్దేశంతో ప్రధాని మోడీ ప్రత్యేకంగా యుబిఎ సెల్ జాతీయస్థాయిలో ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయించారన్నారు. అందులో భాగంగా తమ కళాశాల కాళ్ల మండలంలో పెద అమిరం, కోపల్లే , జక్కరం, కాళ్ల, కాళ్ళకూరు గ్రామాలను దత్తత తీసుకుని ఆయా గ్రామాల్లో పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు వెల్లడించారు. విశాఖపట్నం రీజియన్ పరిధిలో తమ కళాశాలకు రెండు అవార్డులు రావడం పట్ల ఆయన కళాశాల యుబిఎ విభాగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌డి డీన్, యుబిఎ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు, డాక్టర్ ఆర్.సుబ్బారావు, డాక్టర్ జి.సూరిబాబు, డాక్టర్ పి.రఘురాం, డాక్టర్ గణేష్, డాక్టర్ మట్లపూడి సత్యనారాయణ, జీవన్‌కుమార్ పాల్గొన్నాను.

ఆపన్నులకు అండగా కొవ్వలి ఫౌండేషన్

మొగల్తూరు : ఆపదలో ఉన్న వారికి కొవ్వలి ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆ సంస్థ సభ్యులు అన్నారు. రామన్నపాలెం పంచాయతీ పరిధి లక్కువారి తోటలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధితులు లక్కు వీరన్న, లక్కు సత్యవేణికి ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులను శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో బల్ల శ్రీను ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కోమటితిప్ప గ్రామానికి చెందిన పెన్మెత్స ప్రసాదరాజు, తండ్రి: రామరాజు అనే నేను గత నెల సెప్టెంబరు 28వ తేదీన గ్రామం నుండి **J6380634 అనే నెంబరు గల పాస్‌పోర్టు** తీసుకుని మొగల్తూరు ద్విచక్ర వాహనంపై వెళు తుండగా మార్గమధ్యంలో జారి పడిపోయినది. పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

పెన్మెత్స ప్రసాదరాజు
తండ్రి: రామరాజు, కోమటితిప్ప,
మొగల్తూరు మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 85003 72677

పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్, టిసి పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట పంచాయతీ పరిధి చింతల తోట గ్రామానికి చెందిన కోలాటి విన్ను, తండ్రి: వెంకటేశ్వరరావుకు చెందిన అడ్మిన్ నెంబర్ 12435, తమ పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్, టిసి, హాల్ టికెట్ నెంబర్: **1110109349**, సర్టిఫికెట్ నెంబర్: **KK0288110**, పుట్టిన తేదీ: **30-07-1996.** ఉద్యోగ నిమిత్తం ఆచంట నుంచి మహారాష్ట్రం వెళ్ళగా అక్కడి నుంచి ఇంటర్వ్యూకు వెళ్లే నిమిత్తం బస్సులో వెళ్తుండగా నా ఒరిజినల్ సర్టిఫికెట్లు కలిగి ఉన్న బ్యాగ్ పోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియ పరచగలరు.

కోలాటి విన్ను
తండ్రి: వెంకటేశ్వరరావు, డో.నెం.25/12,
ఆచంట చింతల తోట, ఆచంట మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్,
పిన్ కోడ్: 534123. సెల్: 76748 44035

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి :: తణుకు
ఓ.యస్. 324/2020

బిట్వీన్:
వాది: పుల్లూరి అనంత లక్ష్మి
మరియు
ప్రతివాది: చేబ్రోలు రాజేశ్వరి

పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు మీయొక్క హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసియున్నప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు దావా **ది.16-10-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు వాయిదా అయి ఉన్నది.** ఆరోజు నుండి నెల రోజులు లోపల మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల పరోక్షముగావింపబడుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎన్.వి.ఎస్.ఎస్.పి.రామమోహన్
ఎన్.వి.ఎస్.రామానుజం
అడ్వకేట్స్, తణుకు.
తణుకు, సెల్: 99088 22433
13-10-23. 98483 69653

గౌరవనీయులైన కృష్ణా జిల్లా 15వ అదనపు జిల్లా జడ్జి నూజివీడు వారి కోర్టులో
ఇ.ఎ.నెం. 3/2023
ఇన్ ఇ.పి.నెం. 4/2019
ఇన్ ఓ.యస్.నెం. 47/2018

బిట్వీన్:
1) నారాయణ గోపి కృష్ణ
2) వనమా వెంకటేశ్వరరావు ...వాదులు
మరియు
దూపగుంట్ల కిషోర్ ...ప్రతివాది

టు: ప్రతివాది:
దూపగుంట్ల కిషోర్, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందూ, వయస్సు 46 సం॥లు, నివాసం: గంధర్వా అపార్టుమెంటు, నూజివీడు, ఏలూరు జిల్లా.

పై నెంబరు ఇ.ఎ.లో ప్రతివాది అయిన మీరు పైన పేర్కొనిన శ్రీ కోర్టు వారు సదరు ఇ.ఎ.లో డెలివరీ నిమిత్తం నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు నోటీసును తీసుకొనకపోవుట వలన గౌరవ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా **ది.19-10-2023 వ తేదీన ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయం గా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.

మదుపల్లి మధురవి శంకర్
నూజివీడు, వాది తరపు న్యాయవాది
13-10-2023. నూజివీడు.

పవన్‌కు సిఎం జగన్ క్షమాపణ చెప్పాలి : జనసేన

భీమవరం రూరల్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మూడు పెళ్లిళ్లు చేసుకున్నారంటూ వ్యక్తిగత విమర్శలు చేసి ముఖ్యమంత్రి జగన్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని జనసేనకు వీరమహిళలు విమర్శించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరవాసరం ఎంపిటిసి గొల్లపల్లి విజయలక్ష్మి, ఆకుల మౌనిక పలువురు వీర మహిళలు మాట్లాడుతూ పవన్ రాష్ట్రం కోసం, రైతుల కోసం, పేదల కోసం నిరంతరం తపించే నాయకుడన్నారు. పవన్‌పై సామర్లకోట సభలో సిఎం వ్యక్తిగత విమర్శలు చేశారని, ఆ విమర్శలపై పవన్ కళ్యాణ్‌కు జగన్ క్షమాపణ చెప్పాలన్నారు. లేదంటే తాము కూడా జగన్మోహన్ రెడ్డి కుటుంబంపై విమర్శలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అభివృద్ధి అంటే ముఖ్యమంత్రికి అర్థం తెలియదన్నారు. నేడు రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. రాష్ట్ర విభజనపై కేంద్రం వద్ద నుండి హామీలను జగన్ సాధించలేకపోయారని మోడీకి భయపడుతూ ఢిల్లీకి వెళ్లి మోడీ కాళ్ళు పట్టుకుంటున్నారని విమర్శించారు. జగన్ నోరు విప్పితే బూతుపురాణాలు, వ్యక్తిగత విమర్శలే చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కేవలం ఫొటో సెక్షన్‌కి పరిమితమైందన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో తణుకు :: పశ్చిమ గోదావరి జిల్లా
ఓ.యస్. 645/2019

వాది: కాయల సత్తెమ్మ
ప్రతివాదులు: మేకా వెంకట రాజ్యలక్ష్మి వగైరా
1వ ప్రతివాది: మేకా వెంకట రాజ్యలక్ష్మి, భర్త: (లేటు) నాగేశ్వర్రావు, డోర్ నెం.12-67, బ్యాంకు కాలనీ గేవియర్ నగర్, ఏలూరు.

వాది తరపు దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావాలో 1వ ప్రతివాదికి ఎన్ని పర్యాయములు దావా సమన్లు కట్టిననూ అమలు జరుగుటలేదు మరియు ఐ.ఎ. 2015/2019 పిటీషన్లోను నోటీసులు అమలు జరుగుటలేదు. అందువలన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము ఈ పబ్లికేషన్ ప్రచురించిన తేదీ లగాయితూ 30 రోజులలో పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని అడ్వొకేట్ గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లు కాని ఎడల మీ పరోక్షములో ముందు గ్రంధము జరిపించబడును. కనుక తెలియచేయడమైనది.

వాయిదా: **30-10-2023.**

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
కె.యస్.యల్.యన్.ప్రసాద్,
న్యాయవాది, తణుకు, ప॥గో॥జిల్లా.

వేలం ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో
ఇ.పి.నెం. 268/2017
ఇన్ ఓ.ఎస్.నెం. 286/2015

బిట్వీన్:
శ్రీ చింతా రాజారావు ...డి. హెచ్. ఆర్ /వాది
అండ్
శ్రీమతి దామర్ల రాధిక ...జె.డి. ఆర్ /ప్రతివాది

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు జె.డి.ఆర్. సంపూర్ణ స్వాధీన హక్కు భక్తములు గల ఈ క్రింది స్థిరాస్తి షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారి ఎదుట **ది.03-11-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు భహిరంగ వేలం వేయుదురు.** కావున యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

షెడ్యూలు ఆస్తి వివరము: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, వట్లూరు సబ్ రిజిష్టారు యిలాకా, పెదపాడు మండలం, నెహ్రూ నగర్, 10వ రోడ్డు, డో.నెం. 9-11-20 దాఖలా 300 చ॥గ॥ల స్థలమునకు హద్దులు:
తూర్పు: పోరంబోకు స్థలం 31 అ॥లు.
దక్షిణం: మాగంటి బాబి గారి స్థలం 89 అ॥లు.
పడమర: రాజవీధి 31 అ॥లు.
ఉత్తరం: పి.నందం గారి సరిహద్దు గోడ 86 అ॥లు.
ఈ హద్దుల మధ్య 300 చ॥గ॥ల స్థలం వేలం వేయుదురు.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.8,00,000/-
అమీనా విలువ : రూ.20,00,000/-

కిళాంబి జె.వివశ్వంత
అడ్వకేట్, మాగంటి వారి వీధి
ఏలూరు, ఆర్.ఆర్.పేట, ఏలూరు.
15-10-23. సెల్: 94406 64371

గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి నూజివీడు వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 257/2021
ఇన్ ఓ.యస్.నెం. 135/2018

బిట్వీన్:
బెత్లెహేమ్ చారిటబుల్ ట్రస్టు, రిప్రజెంట్ బై ఇట్స్ ప్రెసిడెంట్. ...పిటీషనరు /వాది
మరియు
2) గుండె సుందరపాల్
3) కాటూరి ఏసు రత్నం
4) పులివర్తి ఝాన్సీరాణి
5) పీట పంగిడమ్మ
6) కె.సురేష్ ...ప్రతివాదులు /రెస్పాండెంట్లు

టు: రెస్పాండెంట్లు /ప్రతివాదులు:
2) గుండె సుందరపాల్, తండ్రి: సుశేశ్వరరావు, క్రిష్టియన్, వయస్సు 52 సం॥లు, సోషల్ వర్కర్, డో.నెం. 20-7-28, గ్రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూలు, శాంతి నగర్, విజయవాడ-520003.
3) కాటూరి ఏసురత్నం, తండ్రి: అంకమ్మ, క్రిష్టియన్, వయస్సు 56 సం॥లు, పాస్టర్, నివాసం: కర్రలపాలెం, బాపట్ల దగ్గర, గుంటూరు జిల్లా, పిన్ నెం.520003.
4) పులివర్తి ఝాన్సీరాణి, భర్త: వేమూరి మురళీ మోహన్, క్రిష్టియన్, వయస్సు 36 సం॥లు, నివాసం: జి.పీటర్ సింగ్ చర్చి దగ్గర, ప్రసాదంపాడు, విజయవాడ-520003.
5) పీట పంగిడమ్మ, భర్త: రంగారావు, వయస్సు 38 సం॥లు, చొప్పరమెట్ల గ్రామం, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.
6) కె.సురేష్, తండ్రి: నాట్ నౌన్, క్రిష్టియన్, ఆటో డ్రైవర్, వయస్సు 26 సం॥లు, నివాసం: కె/ఆఫ్ పులవర్తి ఝాన్సీరాణి, జి.పీటర్ సింగ్ చర్చి దగ్గర, ప్రసాదంపాడు, విజయవాడ, పిన్ నెం.521108.

పై నెంబరు ఓ.యస్.నెంబరులో ప్రతివాది అయిన మీరు పైన పేర్కొనిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గాను వాయిదా **ది.06-12-2023వ తేదీన ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించుదురు.

నూజివీడు, **గుడ్డేటి కృష్ణ**
14-10-23. న్యాయవాది, నూజివీడు.

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో

నేటి నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

యాత్రికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
ఆలయ ఛైర్మన్ వెంకట కృష్ణంరాజు, ఇఒ అరుణ్ కుమార్

కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీనుంచి 23 వరకూ శ్రీలక్ష్మీ శరన్నవరాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఇఒ మోకా అరుణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో దాత ఆర్థిక సహకారంతో కేశఖండనశాల అభివృద్ధి పనులను రూ.2.50 లక్షలతో చేపడుతున్నామన్నారు. మరోదాత ఆర్థిక సహకారంతో ప్రసాద విక్రయ కౌంటర్ భవన నిర్మాణ పనులను రూ.20 లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు. దసరా మహోత్సవాలు పది రోజుల పాటు జరుగుతాయన్నారు. అమ్మవారి అలంకరణ దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. తాడినాడకు చెందిన వేగేశ్న వెంకట సూర్య సత్యనారాయణరాజు, సూర్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో ఈ నెల 15వ తేదీన ఆదిలక్ష్మి అమ్మవారి అలంకరణ, పెదకాపవరానికి చెందిన కఠారి రామకృష్ణ-ధనలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో 16న ధాన్యలక్ష్మి అలంకరణ, కాళ్లకూరుకు చెందిన రుద్రరాజు వెంకట సుబ్రహ్మణ్య నరసింహరాజు- అనూష దంపతుల ఆర్థిక సహకారంతో ఈ నెల 17న ధైర్యలక్ష్మిగా అలంకరణ జరుగుతుందన్నారు. భీమవరానికి చెందిన గొట్టుముక్కల అభిలాష్ వర్మ- లక్ష్మీ దుర్గాభవాని, జోగి రామరాజు- నిషిత దంపతుల ఆర్థిక సహకారంతో ఈ నెల 18న గజలక్ష్మిగా, తాడినాడకు చెందిన నంబూరి గజపతిరాజు- వాణి దంపతుల ఆర్థిక సహకారంతో ఈనెల 19న సంతానలక్ష్మిగా, కాళ్లకూరుకు చెందిన మద్దాలి తిరుమల శ్రీ వెంకటేశ్వర్లు- వెంకటతిరు వేంగళమ్మ దంపతుల సాయంతో 20న విద్యాలక్ష్మి అలంకరణ జరుగుతుందన్నారు. అలాగే 21న భీమవరానికి



వెంకట కృష్ణంరాజు, అరుణ్ కుమార్

చెందిన అల్లూరి పద్మరాజు- పద్మ దంపతులు, ఏలూరుపాడుకు చెందిన హరిచంద్ర వెంకట ప్రసాద్ - రామసీత దంపతుల ఆర్థిక సహకారంతో ధనలక్ష్మి అలంకరణ, కాలకూరుకు చెందిన శ్రీయతిరాజుల ఆండాళ్ గోష్టి వారి ఆర్థిక సహకారంతో 22న గాయత్రీదేవిగా, ప్రాతాళ్లమెరక గ్రామానికి చెందిన అల్లూరి అచ్యుత రామరాజు- సూర్య సుబ్బలక్ష్మి దంపతులు, తోటకూర సత్య శ్రీవెంకట సత్య సుబ్రహ్మణ్య విజయ గోపాల వర్మ- రమ్య దంపతులు ఆర్థిక సహకారంతో 23న విజయలక్ష్మిగా అలంకరణ జరుగుతుందన్నారు. అమ్మవారికి తుమ్మపూడి శివప్రసాద్ శర్మచే విశేష అలంకరణలు చేస్తామని తెలిపారు. ప్రతీరోజు సామూహిక కుంకుమ పూజలు, సహస్ర కుంకుమార్చన జరుగుతాయన్నారు.

వైభవంగా సప్తనది జలాభిషేకం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని శ్రీవెంకటేశ్వర స్వామి, అమ్మవార్ల సప్తనదీ జలాభిషేకం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణాలతో ఆలయ ప్రధాన అర్చకులు సింహాద్రి అప్పలాచార్యులు, నరసింహాచార్యులు, వేద పండితులు ఫణి కుమార్‌శర్మ, వెంకటరమణ వారి ఆచార్యత్వమున స్వామివారికి అష్టోత్తర శత కలశ పూజ నిర్వహించారు. తొలుత గ్రామంలో సప్తనదీ జలాలతో శోభాయాత్ర నిర్వహించారు. గంగ, యమున, సరస్వతి, కావేరి, కృష్ణ, గోదావరి, నర్మద, నాగుల జలాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. వేద పండితులు సప్తనదీ జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం యాత్రికులతో కిటకటలాడింది. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఇఒ మోకా అరుణకుమార్, ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజును సత్కరించారు. భీమవరం, ఉండి, ఆకివీడు, కాళ్ల, కలిదిండి మండలాల నుంచి యాత్రికులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, కాళ్లకూరు గ్రామ సర్పంచి సాధు శ్రీదేవి, ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్ రాజ్, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గాదిరాజు వెంకట్ నరేష్ రాజు, పెన్మెత్స కుమార్‌రాజు, బొర్రా సత్యనారాయణ, కంబాల భ్రమరాంబ, బొర్రా మణి, గారా ఈశ్వరమ్మ, దుప్పాడ లక్ష్మి, పి.గ్రేసమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186